ఏడాదిలో పెరిగిన ఓటర్లు 7.23 లక్షలు

- జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 29.48 లక్షలు
- అత్యధికంగా కుత్బుల్లాపూర్‌లో 7.34 లక్షల మంది ఓటర్లు
- అత్యల్పంగా కూకట్‌పల్లిలో 4.86 లక్షల మంది ఓటర్లు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో గత అసెంబ్లీ నుంచి ఇప్పటి వరకు ఏడాది వ్యవధిలో గణనీయంగా 7,23,063 మంది ఓటర్లు పెరిగారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎన్నికల యంత్రాంగం ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేసింది. జిల్లాలోని మేడ్చల్‌, కుత్బుల్లాపూర్‌, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, ఉప్పల్‌ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2023 డిసెంబర్‌ (అసెంబ్లీ ఎన్నికల నాటికి)లో జిల్లా ఎన్నికల సంఘం ముద్రించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 22,25,474 మంది ఉండగా, తాజాగా జిల్లా ఎన్నికల యంత్రాంగం ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం ఓటర్ల సంఖ్య 29,48,537 మంది ఉన్నట్లు వెల్లడించారు. ఇందులో పురుష ఓటర్లు 15,17,375 మంది కాగా, మహిళా ఓటర్లు 14,30,746 ఉన్నారు. అలాగే ఇతరులు 416 మంది ఉండగా, ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 729 మంది కాగా, సర్వీస్‌ ఓటర్లు 714 మంది ఉన్నారు. మేడ్చల్‌ జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 86,629 మంది తక్కువగా ఉన్నారు.

- గత అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో అత్యధికంగా పెరిగిన ఓటర్ల సంఖ్య 7,23,063 మంది ఉన్నారు. అలాగే, కుత్బుల్లాపూర్‌ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,17,799 మంది ఓటర్లు పెరగగా, మేడ్చల్‌లో 1,71,095 మంది ఓటర్లు, మల్కాజిగిరిలో 1,19,246 మంది ఓటర్లు, కూకట్‌పల్లిలో 1,13,197 మంది ఓటర్లు, ఉప్పల్‌ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 1,01,892 మంది ఓటర్లు పెరిగారు.
- జిల్లాలో అత్యధికంగా కుత్బుల్లాపూర్‌ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 7,34,051 మంది ఉండగా, అత్యల్పంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో 4,86,049 మంది ఓటర్లు ఉన్నారు.

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ఓటర్లు, పోలింగ్‌ కేంద్రాల వివరాలు (డిసెంబర్‌ 2023)

నియోజకవర్గం	ఓటర్లు	పోలింగ్‌ కేంద్రాలు
మేడ్చల్‌	5,01,281	571
మల్కాజిగిరి	3,93,868	385
కుత్బుల్లాపూర్‌	5,16,252	457
కూకట్‌పల్లి	3,72,852	383
ఉప్పల్‌	4,41,145	386
మొత్తం	22,25,474	2,182

ఓటర్లు, పోలింగ్‌ కేంద్రాల వివరాలు (జనవరి 2025)

నియోజకవర్గం	ఓటర్లు	పోలింగ్‌ కేంద్రాలు
మేడ్చల్‌	6,72,376	601
మల్కాజిగిరి	5,13,114	418
కుత్బుల్లాపూర్‌	7,34,051	592
కూకట్‌పల్లి	4,86,049	417
ఉప్పల్‌	5,42,947	407
మొత్తం	29,48,537	2,435

నియోజకవర్గాల వారీగా పురుష, మహిళా, ఎన్‌ఆర్‌ఐ, సర్వీస్‌, ఇతరుల ఓటర్ల వివరాలు (జనవరి2025)

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	ఎన్‌ఆర్‌ఐలు	సర్వీస్‌ఓటర్లు
మేడ్చల్‌	3,43,299	3,29,017	60	40	158
మల్కాజిగిరి	2,57,578	2,55,522	14	261	242
కుత్బుల్లాపూర్‌	3,82,611	3,51,274	166	112	104
కూకట్‌పల్లి	2,53,218	2,32,703	128	136	45
ఉప్పల్‌	2,80,669	2,62,230	48	180	165
మొత్తం	15,17,375	14,30,746	416	729	714

కబ్జాకోరల్లో హెచ్‌ఎండీఏ మేడిపల్లి లేఅవుట్‌ స్థలం

సాక్షి,సిటీబ్యూరో: దాదాపు రూ.45 కోట్ల విలువచేసే అత్యంత ఖరీదైన హెచ్‌ఎండీఏ మేడిపల్లి లే–ఔట్‌లోని 3 ఎకరాల స్థలంలో 20 రోజుల కిందట రాత్రికి రాత్రి నాటకీయ పక్కిలో వెలిసిన చిన్నపాటి జామ తోటను తొలగించి, కబ్జాదారుల నుంచి కాపాడాలని జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డికి హెచ్‌ఎండీఏ మేడిపల్లి వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు పద్మారెడ్డి, కార్యదర్శి హేమంత్‌కుమార్‌ కోరారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌ వద్ద హెచ్‌ఎండీఏ మేడిపల్లి వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదంతా జరుగుతున్నా.. హెచ్‌ఎండీఏ ఎస్టేట్‌ అధికారులు, మేడిపల్లి తహసీల్దార్‌ తమకేమీ తెలియదనట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని వారు ఆరోపించారు. అలాగే, పర్వాతాపూర్‌కు వెళ్లే దారి నుంచి మేడిపల్లి లేఔట్‌ లోనికి వెళ్లే 60 ఫీట్ల ప్రధాన రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. మేడిపల్లి లేఅవుట్‌ చుట్టూ ఫెన్సింగ్‌ ఏర్పాటు చేసి భూమి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

మరణించిన ఉద్యోగి కుటుంబానికి చెక్కు అందజేత

మేడ్చల్‌: జిల్లా 104 కార్యాలయంలో హెల్త్‌ అడ్వైజర్‌గా పని చేస్తున్న ఉద్యోగి మరణించడంతో ఆయన కుటుంబానికి సంస్థ 5 లక్షల ఆర్థిక సహాయం అందజేసింది. మేడ్చల్‌ జిల్లా 104 కార్యాలయంలో హెల్త్‌ అడ్వైజర్‌గా పని చేస్తున్న భాస్కర్‌ అనారోగ్యంతో మరణించాడు. సంస్థ తరుపున రూ.5 లక్షల ఆర్థిక సహాయం చెక్కును భాస్కర్‌ భార్య సాగరికకు ఈఎంఆర్‌ఐ గ్రీన్‌ హెల్త్‌ సంస్థ హెచ్‌ఆర్‌ మేనేజర్‌ కిరణ్‌కిషోర్‌ అందజేశారు. సంస్థ ఉద్యోగి మరణిస్తే తప్పకుండా ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

శామీర్‌పేట్‌: త్రైత సిద్ధాంతం–ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక హైదరాబాద్‌ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్‌ జిల్లా, తూంకుంట మున్సిపాలిటీలోని పోతాయిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే ఉత్తరాయణం, సంక్రాతి పండుగల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక హైదరాబాద్‌ కమిటీ అధ్యక్షులు గిరి, సభ్యులు నర్సింహాచారి, హారిక, విజయ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కు అందజేత

కీసర: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ఎంతగానో ఉపయోగపడుతుందని నాగారం మున్సిపల్‌ 2వ వార్డు కౌన్సిలర్‌ ఎలిజాల నాగేష్‌గౌడ్‌ అన్నారు. సోమవారం రాంపల్లికి చెందిన బాలవోయిని శ్రీశైలంకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ క్రింద మంజూరైన రూ. 57,000 వేలు, బాలబోయిని పద్మకు రూ. 45,000 వేలు చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో కో–ఆప్షన్‌ సభ్యులు అశోక్‌గౌడ్‌, అంజయ్యగౌడ్‌, శంకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 8,9 వార్డుల పరిధిలోని ఎస్వీనగర్‌ రోడ్డు నెంబర్‌ 1లో సుమారు 35 లక్షల మున్సిపల్‌ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం కౌన్సిలర్లు కౌకుట్ల మమతా కృష్ణారెడ్డి, అనితాసుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 8,9 వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు పెద్ద ఎత్తున మున్సిపల్‌ నిధులను వెచ్చించి అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు మామిండ్ల సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, నరేందర్‌, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో.. గుండ్లపోచంపల్లి మున్సిపల పరిధిలోని 4వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్‌ సరస్వతి మోహన్‌రెడ్డి ప్రారంభించారు. 20 లక్షల నిధులతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. 4వ వార్డు పరిధిలో ఏజీ కాలనీలో సంపూర్ణ సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

కీసర: నాగారం మున్సిపల్‌ రాంపల్లిలో రోడ్డు విస్తరణ పనులను త్వరలో పూర్తిచేయనున్నట్లు ఈఈ వితలయ్య అన్నారు. సోమవారం ఈఈ రాంపల్లి–చర్లపల్లి, రాంపల్లి–ఘట్‌కేసర్‌ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. రాంపల్లి–ఘట్‌కేసర్‌ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపుల మట్టిని తొలగించి మూడు నెలలు అవుతోందని, పనులు ముందుకు సాగడం లేదని గ్రామస్తులు ఈఈ దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డు విస్తరణ పనులు ఆలస్యమౌతుండటంతో ప్రధాన రహదారిలో ఉన్న దుకాణ సముదాయాల యజమానులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలో రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యే విధంగా చూస్తామన్నారు. అంజయ్యగౌడ్‌, పెంటయ్యగౌడ్‌, శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌ బిల్లులు.. వేతనాలు చెల్లించాలి



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో పెండింగ్‌లో మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనాలు విద్యార్థులకిచ్చే మెనూ చార్జీలు వెంటనే ఇవ్వాలని యూనియన్‌ రాష్ట్ర కోశాధికారి ఉన్నీకృష్ణన్‌ డిమాండ్‌ చేశారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి, వంట చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నారని పేర్కొన్నారు. సోమవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌ ఎదుట మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్‌ (సీఐటీయూ) ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్‌ జిల్లా అధ్యక్షురాలు ప్రేమలత, ఉన్నీకృష్ణన్‌ మాట్లాడుతూ.. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం జిల్లా విదాశాఖ అధికారి విజయకుమారికి వినతి పత్రం అందజేశారు. ఇందులో భాగ్య, విజయలక్ష్మి, మంజుల, వసంత మధ్యాహ్న భోజనం కార్మికులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 114 ఫిర్యాదులు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలపై కలెక్టరేట్‌ ప్రజావాణిలో 114 ఫిర్యాదలను రాత పూర్వకంగా అందజేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి ప్రజలను ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ.. సంబంధిత శాఖల జిల్లా అధికారులు ప్రజల దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇందులో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు



పైపులైన్‌ పనులు పర్యవేక్షిస్తున్న చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య

ఘట్‌కేసర్‌: మంచి నీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా అవసరమైన అన్నీ చర్యలు తీసుకోవాలని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య అన్నారు. మున్సిపాలిటీలోని 16వ వార్డులో సోమవారం పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డులో తరచు ట్రిప్‌ అవుతున్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కొత్త స్టాటర్స్‌ను బిగింపజేయాలని విద్యుత్‌ ఏఈను ఆదేశించారు. అనంతరం వార్డులో లీకేజీ అవుతున్న మంచి నీటి సరఫరా పైపులైన్‌ పనులకు మరమ్మతులు చేయించారు. వార్డులో ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో విద్యుత్‌ ఏఈ యశ్వత్‌కుమార్‌, లైన్‌మెన్‌ రవి, జంగయ్య యాదవ్‌, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పరిశోధనలకు.. నైపుణ్యాలు తోడైతేనే విజయం



నళిని విండ్‌ టెన్నల్‌ను ప్రారంభిస్తున్న గౌతమ్‌ కుర్రా, బిట్స్‌ వైస్‌చాన్సిలర్‌ తదితరులు

జవహర్‌నగర్‌: అత్యాధునిక స్టార్టప్‌లతో అద్భుతమైన ఆవిష్కరణలు సృష్టించవచ్చని, భవిష్యత్‌ అంతా ఏరోస్పేస్‌, ఆటోమోటీవ్‌ ఇంజనీరింగ్‌దేనని, విద్యార్థులు పరిశోధనలలో పట్టు సాధించవచ్చని విస్క్యూ, గ్లింట్‌ సహా వ్యవస్థాపకుడు గౌతమ్‌ కుర్రా అన్నారు. బిట్స్‌ ఫిలానీ పూర్వ విద్యార్థి గౌతమ్‌ కుర్రా సహకారంతో జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ పరిధిలోని బిట్స్‌ ఫిలానీ క్యాంపస్‌లో అత్యాధునిక పరిశోధనా సదుపాయమైన నళిని క్రు విండ్‌ టెన్నెల్‌ ఫెసిలిటీని సోమవారం వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌతమ్‌కుర్రా హాజరై మాట్లాడుతూ.. నా భవిష్యత్‌ను ముందుకు తీసుకెళ్లి ఓ సంస్థకు సహ వ్యవస్థాపకుడి స్థాయికి ఎదగడంలో బిట్స్‌ ఫిలానీ కృషి మరవలేనిదన్నారు. పూర్వ విద్యార్థి గౌతమ్‌ కుర్రా బిట్స్‌ ఫిలానీ క్యాంపస్‌కు అందజేసిన విండ్‌ టెన్నల్‌ గొప్ప ఆవిష్కరణకు ప్రేరేపిస్తుందని బిట్స్‌ఫిలానీ వైస్‌చాన్సలర్‌ రాంగోపాల్‌రావు, డైరెక్టర్‌ సౌమ్యముఖర్జీ, ప్రొఫెసర్లు అభినందించారు. సియోరా అట్లాంటిక్‌, గ్లోబల్‌ టెక్నాలజీ లీడర్‌ రాజురెడ్డి, డీన్‌, పరిశోధన విద్యార్థులు, బిట్స్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: సబ్‌ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టినందున మంగళవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్‌ కుమార్‌ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నారపల్లిలోని సప్తగిరికాలనీ, సత్తిరెడ్డి వ్యవసాయ బావి, కొర్రెముల్‌, వెంకటాపూర్‌, మక్త, తేనెగూడెం, టూబీహెచ్‌కే, బాలాజీనగర్‌, సాదతలీగూడ, సుప్రభాత్‌ టౌన్‌షిప్‌, ఓయూ కాలనీ, కొర్రెముల క్రాస్‌ రోడ్‌, మహాలక్ష్మీపురం, సురేందర్‌రెడ్డినగర్‌, బాబానగర్‌, గణేష్‌నగర్‌, నారపల్లి, ఎస్‌పీ కాలనీ, రేవతి రైస్‌ మిల్‌, నారపల్లి వీకర్‌ సెక్షన్‌కాలనీ, అంజనీ స్కూల్‌, వెంకటాద్రి టౌన్‌షిప్‌, విజయపురి కాలనీ, శివాజీనగర్‌, డాక్టర్స్‌ కాలనీ, అశోక్‌ లేల్యాండ్‌ షోరూమ్‌, తాజా ఫుడ్స్‌, యాదాద్రి కాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మేడ్చల్‌లో...

మేడ్చల్‌: మరమ్మతుల కారణంగా నేడు పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో నేడు కరెంట్‌ సరఫరా ఉండదని ఏఈలు రాంబాబు, విజయ్‌కుమార్‌ తెలిపారు. గుండ్లపోచంపల్లి సబ్‌ స్టేషన్‌ పరిధిలో కేవీరెడ్డినగర్‌, సాయిగీత ఆశ్రమం ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్‌ సరఫరా ఉండదని తెలిపారు. బండమాదారం సబ్‌స్టేషన్‌ పరిధిలో రాయిలాపూర్‌, శ్రీరంగవరం, బండమాదారం గ్రామాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్‌ సరఫరా ఉండదని ఏఈలు తెలిపారు.

దేవస్థానం అభివృద్ధికి కృషి



ఆలయ చైర్మన్‌ తటాకం నారాయణ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

కీసర: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం భవానీరామలింగేశ్వర స్వామి ఆలయ నూతన చైర్మన్‌ తటాకం నారాయణ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కీసరగుట్టలో ప్రతియేడు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలతోపాటు, కార్తీకమాసం, శ్రావణమాసోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్‌ తటాకం నారాయణ చర్యలు చేపట్టాలని కోరారు. కీసర ఆలయానికి వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. దేవాలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే మల్లారెడ్డి, తోటకూర వజ్రేష్‌యాదవ్‌లు కీసరగుట్ట స్వామివారి సేవలో పాల్గొన్నారు. కొత్త చైర్మన్‌ తటాకం నారాయణ మాట్లాడుతూ.. అందరి సహకారంతో ఈ ఏడాది మహాశివరాత్రి బ్రహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మేడ్చల్‌జిల్లా పరిషత్‌ మాజీ చైర్మన్‌ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, బోడుప్పల్‌ మేయర్‌ అజయ్‌యాదవ్‌, నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్‌ చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, ప్రణితాశ్రీకాంత్‌గౌడ్‌, వైస్‌చైర్మన్లు నరేందర్‌రెడ్డి, ఉప్పల్‌ మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, వంశపారంపర్య ధర్మకర్తలు తటాకం వెంకటేష్‌, రమేష్‌, ఉమాపతి, ఈఓ సుధాకర్‌రెడ్డి, కీసరమండల కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షులు కృష్ణాయాదవ్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రామిడి విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు మద్దతుగా ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన



సాక్షి,సిటీబ్యూరో: 30 రోజుల నుంచి సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఒప్పంద ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ.. వారికి మద్దతుగా తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలువు మేరకు ఎస్‌ఎఫ్‌ఐ మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్‌ కలెక్టర్‌ కార్యాలయం ముందు విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్‌, రాథోడ్‌ సంతోష్‌ మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు పాఠశాల విద్య మెరుగు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. 30 రోజులుగా శాంతియుతంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సిబ్బంది సమ్మెలో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తుండటంతో ప్రభుత్వం వీరి సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్‌ చేయాలని వారు డిమాండ్‌ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి, డీఈవో విజయకుమారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు అరుణ్‌, భగత్‌, శ్యామ్‌రావు, సుబ్బు, అనిల్‌, రాము, రఘు, దినేష్‌, నందీశ్వర్‌, శ్రీకాంత్‌, కర్ణాకర్‌, అజయ్‌, శివకుమార్‌, రాజేష్‌, చరణ్‌, సాయిరాం సమగ్ర శిక్షణ ఉద్యోగ ప్రతినిధులు ఫణికుమార్‌, మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్‌, డైరీ ఆవిష్కరణ



కేలండర్‌, డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

కీసర: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌(టీయుటీఎఫ్‌) మేడ్చల్‌జిల్లా కేలండర్‌, దైనందిని(డైరీ)ని సోమవారం మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీయుటీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు నల్గొండ–ఖమ్మం–వరంగల్‌ టీచర్‌ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి కైలాసం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సయ్యద్‌ రూహీ, మేడ్చల్‌జిల్లా అధ్యక్షులు రాజు, గణేష్‌, సతీష్‌, మంజుల, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విలేకరులపై చర్యలు తీసుకోవాలి

కీసర: పేద ప్రజలను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ విలేకరిపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని కోరుతూ దమ్మాయిగూడ మున్సిపల్‌ కౌన్సిలర్‌ వెంకటేష్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన కీసరలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అహ్మద్‌గూడ రెవెన్యూ సర్వే నెం. 38ఈ లో 267 గజాల స్థలంలో తాను అహ్మద్‌గూడ వార్డు సభ్యుడిగా ఉన్న సమయంలో గ్రామ పంచాయతీ నుంచి అన్నీ అనుమతులు తీసుకొని ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తు చేసుకొని గది నిర్మాణం చేపట్టి అద్దెకు ఇవ్వడం జరిగిందన్నారు. ఇటీవల పాత గదిని కూల్చి తిరిగి నిర్మాణం చేపడుతుండగా ఓ వ్యక్తి తాను ప్రముఖ ఛానెల్‌ విలేకరినని చెప్పుకొని రూ. 50 వేలు డిమాండ్‌ చేశాడని తెలిపారు. డబ్బులు ఇవ్వకపోవడంతో కొత్తగా చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేయాలని మున్సిపల్‌ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఇందుకు మున్సిపల్‌ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్‌పై పని చేసే సిబ్బంది అతనికి సహకరిస్తున్నారని ఆరోపించారు. అతను ప్రముఖ ఛానెల్‌కు సంబంధించిన నకిలీ గుర్తింపు కార్డు చూపిస్తూ కీసర, నాగారం, దమ్మాయిగూడ ప్రాంతాల్లో సైతం నిర్మాణాలు చేపట్టే వారిని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నాడని తెలిపారు. అమాయక ప్రజలు వేధిస్తున్న నకిలీ విలేకరులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రెండు జిల్లాల సరిహద్దు ఫ్లైఓవర్‌ విస్తరణ ఊసేదీ..?

- ప్రభుత్వం మారాక కదలిక శూన్యం..
- ఫ్లైఓవర్‌ కింది మార్గం సంగతి కూడా అంతే..
- ఎటూ తేలని పరిహారం..ఆగిన విస్తరణ..



సనత్‌నగర్‌: మేడ్చల్‌ మల్కాజిగిరి, హైదరాబాద్‌ జిల్లాను కలిపే ఫ్లై ఓవర్‌ అది. రెండు జిల్లాలకు సరిహద్దుగా ఉన్న ఫతేనగర్‌ ఫ్లైఓవర్‌ ఇప్పటి జనాభాకు, వాహనాల సంఖ్యకు ఏమాత్రం సరిపోవడం లేదు. అసలే ఫ్లైఓవర్‌ వెడల్పు తక్కువగా ఉండడం, ఆపై ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, మధ్యలో డివైడర్‌ నిర్మాణంతో మరింత ఇరుకుగా మారింది. దీంతో ఎటువైపు వెళ్లాలన్నా ఒక కారు మాత్రమే వెళ్లగలుగుతుందే తప్ప పక్కన మరో వాహనం వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ఒక కారు వెనుక మాత్రమే మరో వాహనం రావాల్సిందే. అనుకోని పరిస్థితుల్లో కారు బ్రేక్‌ డౌన్‌ అవడం గానీ, ప్రమాదం గానీ జరిగిందంటే ఇక ఫ్లైవర్‌ ప్రయాణం ప్రత్యక్ష నరకమే. ఫ్లైఓవర్‌పై వాహనాలు బారులుదీరి ముందుకు కదల్లేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ముందస్తు ఆలోచన లేకుండా నిర్మితమైన ఈ ఫ్లైఓవర్‌పై ప్రయాణం దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లుగా తయారైంది. ముఖ్యంగా నర్సాపూర్‌, గండిమైసమ్మ, జీడిమెట్ల, షాపూర్‌, చింతల్‌, బాలానగర్‌, బోయిన్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి ఎస్సార్‌నగర్‌, అమీర్‌పేట, బేగంపేటతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ ఫ్లైఓవర్‌ దిక్కు. అప్పట్లో మంత్రి కేటీఆర్‌ 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు దీనికి శంకుస్థాపన కూడా చేశారు.

వెక్కిరిస్తున్న శిలాఫలకం..

నిధులు మంజూరై శంకుస్థాపన కార్యక్రమం కూడా జరిగినా ఫతేనగర్‌ ఫ్లైఓవర్‌ విస్తరణ పనులు ఇసుమంతైనా ముందుకు కదల్లేదు. అసలు బ్రిడ్జి విస్తరణ చేపట్టాలంటే ముందుకు ఆస్తుల సేకరణ ప్రక్రియ జరగాలి. ఎక్కడెక్కడ ఎన్ని ఆస్తులు, ఎంత మేర ఆస్తులు స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందో మార్కింగ్‌ కూడా చేయాలి. ఈ తంతు ఇంతవరకు ప్రారంభమే కాదు. అసలు ఆ ఊసే లేదు. గత ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లైఓవర్‌ విస్తరణ ప్రాజెక్ట్‌ కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక అసలు కదలిక లేకపోవడంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు.

ఫ్లైఓవర్‌ కింద రహదారి విస్తరణ కూడా అంతే..

బల్కంపేట వైపు నుంచి సనత్‌నగర్‌కు ఫ్లైఓవర్‌ కిందుగా వెళ్లే మార్గాన్నైనా సుగమం చేశారా? అంటే అదీ లేదు. ఈ మార్గమైన అందుబాటులోకి వస్తే సనత్‌నగర్‌, ఎర్రగడ్డ వైపు వెళ్లే వారు ఫ్లైఓవర్‌ ఎక్కాల్సిన అవసరం లేకుండా కింది నుంచి వెళ్లవచ్చు. ఫ్లైఓవర్‌ కింది మార్గం విస్తరణ జరిగే క్రమంలో ఆస్తులు కోల్పోయేవారికి పరిహారం అందించే విషయం ఎటూ తేలక తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఇటు ఫ్లైఓవర్‌ కింద మార్గం సుగమం కాక, ఇటు ఫ్లైఓవర్‌ విస్తరణ ప్రక్రియలో కదలిక లేక ట్రాఫిక్‌ తిప్పలు తప్పడం లేదు.